గతమెంతో ఘనం.. నేడు అధ్వానం..!

- నెహ్రూ బజార్‌లో గతంలో 215 షాపుల నిర్మాణం
- ప్రస్తుతం 63 దుకాణాల్లోనే వ్యాపారాల నిర్వహణ
- శిథిలమవడంతో ఖాళీ చేసేసిన వ్యాపారులు
- నిర్వహణ మరిచిపోయిన జీవీఎంసీ జోన్ – 3 అధికారులు

సీతమ్మధార : గతమెంతో ఘనం... వర్తమానం అధ్వానం... అన్న మాట నెహ్రూ బజార్‌కు సరిగ్గా అతికినట్టు సరిపోతుంది. జోన్ – 3 పరిధి జీవీఎంసీ 27వ వార్డులో గల ఈ బజార్ నిర్వహణను అధికారులు పూర్తిగా గాలికొదిలేశారు. ఫలితంగా షాపులు శిథిలావస్థకు చేరుకోవడం, షెడ్లపై రేకులు విరిగిపోవడంతో తగినంతగా బేరాలు లేక అధిక సంఖ్యలో వ్యాపారులు ఇక్కడి నుంచి దుకాణాలు ఖాళీ చేసేసి వెళ్లిపోతున్నారు. మరోవైపు గతంలో కొనుగోలుదారులకు ఈ బజారులో అన్ని వస్తువులూ దొరికినా... ప్రస్తుతం ఇక్కడ ఆ పరిస్థితి లేకుండాపోయింది. దీంతో వినియోగదారులు కూడా ఇక్కడకు రావడం తగ్గించేసి దూరాభారమైనా సరే నరసింహనగర్, సీతమ్మధార రైతుబజార్లు, పూర్ణా మార్కెట్ వైపు వెళ్లిపోతున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన నెహ్రూ బజారు పరిస్థితి రోజురోజుకూ తీసికట్టుగా మారుతున్నా జోన్ – 3 ఉన్నతాధికారులు, రెవెన్యూ విభాగం అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం గమనార్హం.

కాందిశీకుల కోసం బజారు ఏర్పాటు

మహా నగర పాలక సంస్థ 27 వార్డు పరిధిలో బర్మా కాందిశీకులకు బతుకుతెరువు కోసం సుమారు ఒక ఎకరం పది సెంట్ల విస్తీర్ణం గల భూమిలో ఆర్‌సీసీ స్లాబ్ షట్టర్లతో 63 షాపులతో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను గతంలో ప్రభుత్వం నిర్మించింది. వీటిల్లో సెకండ్ హ్యాండ్ వస్తువులు, ఇతర సామగ్రి విక్రయించేవారు. వాటి పక్కనే 60 కూరగాయలు షాపులు, 55 షాపులతో చేపల మార్కెట్, 25 చికెన్, మటన్ షాపులు, 6 మటన్ తలకాయ షాపులు, 6 ఆకుకూరల షాపులు కోసం రేకుల షెడ్లు నిర్మించారు. మొత్తంగా సుమారు 215 షాపుల్లో వ్యాపారులు నిర్వహించుకునేందుకు వీలుగా తీర్చిదిద్దారు. చాలా కాలంపాటు కళకళలాడిన బజారు కాలక్రమంలో నిర్వహణ లేక కళావిహీనంగా మారింది. షాపులు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిల్లో వ్యాపారాల నిర్వహణ ప్రమాదకరమని భావించిన పలువురు వ్యాపారులు అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం బజారులో కేవలం కొద్ది మంది వ్యాపారులు మాత్రమే వున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ సరైన పార్కింగ్ సదుపాయం కూడా లేదు. మరోవైపు బజారు లోపల ఎక్కడ చూసినా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. చేపల బజారుని రోజూ సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ఫలితంగా బజారుకి వచ్చే వినియోగదారుల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా తగ్గిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. జోన్ – 3 రెవెన్యూ విభాగం అధికారులకు ఇక్కడ అద్దెల వసూళ్ల మీద వున్న శ్రద్ధ సదుపాయాల కల్పన మీద ఏమాత్రం లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో మహిళా వ్యాపారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.


బజారులో శిథిలమైన రేకుల షెడ్లు


నెహ్రూ బజారులో శిథిలావస్థకు చేరుకున్న షాపులు

ప్రస్తుతం కేవలం 63 షాపులే నిర్వహణ

కొన్నేళ్లుగా బజారు నిర్వహణను పట్టించుకోకపోవడంతోపాటు సకాలంలో సరైన మరమ్మతులు చేపట్టకపోవడం, విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో చాలా మంది వ్యాపారులు వ్యాపారాలు సాగక ఆర్థికంగా నష్టపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన 215 దుకాణాల్లో ఏటా కొన్ని ఖాళీ అయిపోతున్నాయి. ప్రస్తుతం కేవలం 63 షాపుల్లోనే వ్యాపారాలు సాగిస్తున్నారు. ఫలితంగా జోన్ – 3కి వచ్చే ఆదాయం కూడా గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం బజారులో పలు దుకాణాలు మూతపడి వున్నాయి. అలాగే ఏళ్ల తరబడి కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో షాపుల గోడలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో 2014 – 19 మధ్య కాలంలో కొత్త మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదనలతో డీపీఆర్ తయారు చేసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ మార్కెట్ ద్వారా ప్రత్యక్షంగా సుమారు 225 మంది, పరోక్షంగా మరో 100 మంది వరకు బతుకుతెరువు కొనసాగిస్తున్నారు. మౌలిక సదుపాయాలతో కొత్త మార్కెట్ నిర్మిస్తే నెహ్రూ బజారు రూపురేఖలు మారిపోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని వేలాది మంది వినియోగదారులకు అవసరమైన సరకులు లభించే అవకాశాలున్నాయి.


బజారు ముందు భాగంలో నిర్వహిస్తున్న షాపులు

ఎట్టకేలకు లైట్లు ఆర్పారు..

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో కొంతకాలంగా పగలు కూడా వెలుగుతున్న వీధి లైట్లను అధికారులు ఎట్టకేలకు మంగళవారం ఆర్పారు. అధికారుల నిర్లక్ష్యంపై 'పగలే విద్యుత్ వెలుగులు' శీర్షికతో 'సాక్షి' పత్రికలో మంగళవారం ప్రచురించిన వార్తకు జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లు స్పందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పలు లైట్లకు మరమ్మతులు నిర్వహించారు. తీగల సమస్య కారణంగా కనెక్షన్ డైరెక్ట్ అవ్వడంతో పగలు కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయని గుర్తించామని అధికారులు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

వీధి కుక్కలతో బెంబేలు

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాస నగర్ ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు గుంపులుగా సంచరిస్తూ జనాన్ని భయాందోళనకు గురి చేస్తున్నాయి. కర్రివాని బ్రిడ్జి ప్రాంతంలో రాత్రి పగలు అన్న తేడా లేకుండా వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనచోదకులపై దాడి చేసేందుకు పరుగు తీస్తున్నాయి. దీంతో పిల్లలు, మహిళలు పరుగుతీస్తున్నారు. వాహన చోదకుల వెంట పడటంతో ఒక్కసారిగా స్పీడ్ అందుకోవడంతో ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


శ్రీనివాసనగర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కల గుంపు

క్లుప్తంగా

నేత్రదానంపై కరపత్రాల పంపిణీ


నేత్రదానం ఆవశ్యకతను వివరిస్తున్న సురేష్

సీతంపేట : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో మంగళవారం అక్కయ్యపాలెంలోని జ్ఞానని కేతన్ స్కూల్‌లో నేత్రదానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల పారా మెడికల్ ఆఫ్తాలమిక్ ఆఫీసర్లు ఆర్.సురేష్, కె.అనిత పాఠశాలలో 9, 10 తరగతి విద్యార్థులకు నేత్రదాన ఆవశ్యకత వివరించారు. అనంతరం కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా నేత్రదాన ఆవశ్యకతపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పక్షోత్సవాల ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. స్కూల్ కరస్పాండెంట్ సునీత, హెచ్ఎం పి.సురేష్‌కుమార్, గణేష్ పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ సభ

సింథియా: ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం ఇటీవల జరిగిన గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సందర్భంగా బుధవారం విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ ప్రధాన కార్యదర్శి ఎస్.రాజేష్ తెలిపారు. 104 ఏరియా సమీపంలోని మేఘాద్రిపేట డిఫెన్స్ సివిలియన్‌కాలనీలో గల కళామేఘ ఆడిటోరియంలో జరగనున్న సభకు ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, అఖిల భారత డిఫెన్స్ మజ్దూర్ సంఘం ప్రతినిధులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

మట్టి ప్రతిమలనే పూజిద్దాం


మట్టి ప్రతిమలు అందజేస్తున్న ధ్యాన మందిరం నిర్వాహకులు

తాటిచెట్లపాలెం : వినాయక చవితి ఉత్సవాల్లో ప్రతీ ఇంటిలోనూ పర్యావరణహిత మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గౌండ్స్ ఎదురుగా గల షిర్డి సాయిబాబా ధ్యానమందిరం వ్యవస్థాపకులు నూకల శేషగిరిరావు సూచించారు. స్వాతి ప్రమోటర్స్ ఎండీ కృష్ణారెడ్డి సహకారంతో ధ్యానమందిరం ప్రాంగణంలో భక్తులకు వినాయక మట్టి ప్రతిమలను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ నెల 5న ధ్యానమందిరం ప్రాంగణంలో భక్తులకు మరిన్ని ప్రతిమలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

108 వాహనాలు కండీషన్‌లో ఉంచాలి


ఫ్లీట్ మేనేజర్ తేజను సన్మానిస్తున్న 108 సిబ్బంది

మహారాణిపేట: వర్షాలు కురుస్తున్నందున 108 వాహనాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నిర్వాహణ విషయంలో జాగ్రత్తలు తప్పనిసరి అని అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ సంస్థ సిబ్బంది సూచించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 108 వాహనాలు 52, 102 వాహనాలు 67, 104 వాహనాలు 79 ఉన్నాయి. ఈ వాహనాల సిబ్బందితో రేసపువానిపాలెంలోని డీఎం హెచ్‌వో కార్యాలయ ఆవరణలో ఫ్లీట్ మేనేజర్ తేజ, జగ్గరాజు మంగళవారం సమావేశమయ్యారు. వాహనాల పరిస్థితి ఎలా ఉంది, సాంకేతిక, మరమ్మతులేమైనా ఉన్నాయా తెలుసుకున్నారు. వాహనాల కండీషన్ చక్కగా ఉండాలని సూచించారు. తుఫాన్ల నేపథ్యంలో వాహనాలను సరైన చోట పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో 108 డీఎం త్రినాథరావు, 108 సిటీ కో – ఆర్డినేటర్ ఎం.సురేష్, 104 డీఎం అచ్చుతరావు, 102 కో – ఆర్డినేటర్ శేఖర్, నాగేశ్వరరావు, శ్యామ్ పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థతో కాంట్రాక్టు కార్మికులకు నష్టం

సీతంపేట : దళారీల చేతిలో నలిగిపోతూ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో వెట్టి చాకిరీ చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ కాంట్రాక్టు వర్కర్లకు పెరిగిన వేతనాలు చెల్లించాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూదోట ప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఉన్న రోగులకు ఇబ్బంది కలగకుండా సేవలందిస్తున్న సిబ్బందిని దళారీ వ్యవస్థలో పెట్టి అన్యాయం చేస్తున్నారన్నారు. పెరిగిన జీతాలు ఇవ్వకుండా, పీఎఫ్ డబ్బులు, ఈఎస్ఐ కార్డులు ఇవ్వకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 549, 43 జీవోల ప్రకారం పెరిగిన వేతనాలు చెల్లించాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బుగత అశోక్ మాట్లాడుతూ ఇటీవల కాంట్రాక్టరు మారిన తర్వాత 38 నెలల నుంచి పీఎఫ్ ఎంత జమ అవుతోంది, ఈఎస్ఐ కోసం ఎంత కటింగ్ చేస్తున్నారో చెప్పడం లేదన్నారు. ప్లే స్లిప్పులు ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టు వర్కర్లను దళారీ వ్యవస్థ నుంచి తప్పించి ఆప్కాస్‌లో చేర్చి ప్రతి నెలా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.వామనమూర్తి, ఆర్.వి.ఎస్.కుమార్, కోన లక్ష్మణ పాల్గొన్నారు.


కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్ట్ వర్కర్లు

కళాపీఠం లోగో ఆవిష్కరణ

సీతంపేట : పవన్ కల్యాణ్ కళాపీఠం సంస్థ ద్వారకా నగర్ పౌరగ్రంథాలయంలో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కార్పొరేటర్ కందుల నాగరాజు చేతుల మీదుగా సంస్థ లోగో, ట్రోఫీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరంజీవి కళాపరిషత్ ఇప్పటికే ఉందని, ఇప్పుడు పవన్ కల్యాణ్ కళా పరిషత్ ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ఈ సంస్థ భవిష్యత్‌లో అనేక సేవా, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు అందుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు గెంబలి జగదీష్, అధ్యక్షుడు మెరుపు వరప్రసాద్, కార్యదర్శి పీలా హరిప్రసాద్, గమటి మురళీధర్, రవితేజ, ఆర్.నాగరాజు పట్నాయక్, కె.ఇందిర పాల్గొన్నారు.


కళాపీఠం లోగో ఆవిష్కరిస్తున్న అతిథులు

సింగిల్‌విండో విధానంలో అనుమతులు

ఫోర్త్ టౌన్ సీఐ విజయ్‌కుమార్



సీతమ్మధార : ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానం ద్వారానే అనుమతులు ఇస్తున్నామని నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల స్టేషన్‌లో ఆయన 'సాక్షి'తో మంగళవారం మాట్లాడారు. అనుమతుల కోసం మొబైల్ యాప్ ఆగస్టు 30 నుంచి అందుబాటులోకి వచ్చిందని గుర్తు చేశారు. గణేష్ ఉత్సవ్.నెట్ వైబ్‌సైట్ లేదా 7995095800 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా వచ్చిన దరఖాస్తుని పూర్తి చేయాల్సి వుంటుందన్నారు. నిర్వాహకులు ఆఫ్‌లైన్‌లో కూడా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. తమ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 70 దరఖాస్తులు వచ్చాయన్నారు.

చుట్టుపక్కల వారిని ఇబ్బంది పెట్టొద్దు

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్వాహకులు చుట్టుపక్కల ప్రజలకు, ట్రాఫిక్‌కి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. జీవీఎంసీ, అగ్నిమాపకశాఖ వద్ద చలానా చెల్లించి, మైక్‌సెట్ కోసం మీ – సేవ కేంద్రాల్లో రోజుకి రూ.వంద వంతున చలానా చెల్లించి వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసుకోవాల్సి వుంటుందన్నారు. అనంతరం తమ సిబ్బంది సదరు మండపం వద్దకు వచ్చి పరిశీలించిన తర్వాత అనుమతులు జారీ చేస్తామన్నారు. తర్వాత కమిటీ సభ్యులు వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఎన్‌వోసీ తీసుకుని, క్యూ ఆర్ కోడ్‌ను డౌన్‌లోడు చేసుకుని మండపం వద్ద అతికించాల్సి వుంటుందని సీఐ స్పష్టం చేశారు. మండపం వద్ద మైక్‌సెట్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి పది వరకు మాత్రమే వినియోగించాలన్నారు. పెద్ద పెద్ద శబ్దాలతో చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. ఊరేగింపులో డీజే, బాణసంచాపై నిషేధం వుందన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు మీద మండపాలు వేసి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించొద్దన్నారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలకు సమీపంలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి వారికి ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. అలాగే ఆస్పత్రులు, పాఠశాలలకు దూరంగా మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుపోత్సవాలు పోలీసులు సూచించిన మార్గంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. రాత్రి పది గంటలలోపే వినాయక అనుపు పూర్తి కావాలని, లేకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసులతో సహకరించాలని కోరారు.

అంధకారంలో వుడా కాలనీ రోడ్డు


చీకటిగా ఉన్న మాధవధార వుడా కాలనీ రోడ్డు

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీ 48వ నంబరు లాస్ట్ బస్టాప్ రోడ్డులో వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. సుమారు అర కిలోమీటరు మేర ఇదే పరిస్థితి నెలకొనడంతో రాత్రి వేళ చీకటిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు, వాహనచోదకులు, కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే చీకటిగా ఉండడంతో మహిళలు ఒంటరిగా అటువైపు వెళ్లడానికి భయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏపీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వరప్రసాద్



కంచరపాలెం : ఆలిండియా ప్రొటెక్షన్ షెడ్యూల్ క్యాస్ట్ సొసైటీ (ఏపీఎస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ మాముడూరి వరప్రసాద్‌ను నియమిస్తూ హైదరాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఆ సంస్థ నేషనల్ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి ఎ.శ్యామ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన వరప్రసాద్ అంబేడ్కర్ వరల్డ్ సేన, హ్యూమన్ రైట్స్, ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. తనకు అప్పగించిన బాధ్యతలు నెరవేరుస్తానని, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

భారత్ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలి

సీతమ్మధార : పరుగు పందెంలో విశాఖపట్నం కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేయాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కోరారు. ఇటీవల ఒలంపిక్స్‌లో భారత్ తరపున పాల్గొన్న అథ్లెట్ యర్రా జ్యోతిని బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బీజేపీ కార్యాలయంలో ఆయన శాలువాతో మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలంపిక్స్‌లో భారత్ తరపున విశాఖపట్నం నుంచి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గొప్ప విషయమన్నారు. పతకం రాకపోయినా నిరాశ చెందొద్దని, మరోసారి ప్రతిభతో సత్తా చాటుకోవాలని కోరారు. కార్యక్రమంలో యర్రా జ్యోతి తల్లి కుమారి, అన్నయ్య సురేష్ పాల్గొన్నారు.


క్రీడాకారిణి జ్యోతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

బుల్లయ్య కళాశాల విద్యార్థులకు పతకాలు

సీతంపేట : ఇటీవల అనకాపల్లి జిల్లాలో జరిగిన ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బుల్లయ్య కళాశాల విద్యార్థులు పతకాలు సాధించారు. పురుషుల విభాగంలో బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం.తరుణ్ స్నాచ్‌లో 130 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 161 కేజీలు ఎత్తి స్వర్ణ పతకం సాధించాడు. అలాగే స్ట్రాంగ్ బాయ్ టైటిల్ సొంతం చేసుకున్నాడు. మహిళల విభాగంలో బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఎస్.కుముదుని పట్నాయక్ కాంస్య పతకం సాధించింది. వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి అభినందించారు.


విజేతలను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల సెక్రటరీ మధుకుమార్ తదితరులు

నాటారు.. నరికారు


ఏయూలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు


అక్కయ్యపాలెం ప్రాంతంలో నరికేసిన చెట్లు

వన మహోత్సవం పేరుతో ప్రభుత్వం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తోంది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో నగరంలో పలు చోట్ల ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఒకవైపు పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రయత్నిస్తుంటే.. మరోవైపు అదే పచ్చదనాన్ని నాశనం చేస్తుండటం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నేత్రదానంపై అపోహలు తొలగించాలి


సదస్సులో కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, రీజినల్ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ మీనాక్షి తదితరులు

మహారాణిపేట: నేత్రదానంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించాలని అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి సూచించారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా కేజీహెచ్‌లో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమం నర్సులకు మాత్రమే కాకుండా వైద్యులందరికీ నిర్వహిస్తే బాగుంటుందని సూచించారు. అనంతరం మీనాక్షి మాట్లాడుతూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు 15 రోజులపాటు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించాలని నర్సింగ్ స్టాఫ్‌కి, విద్యార్థులకు సూచించారు. నేత్రదాన ప్రతిజ్ఞపై ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల వైద్యులు ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి వివరించారు. ఎల్‌వీ ప్రసాద్ హాస్పిటల్, మోహ్సిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి అభిత్ జైన్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ ధవళ భాస్కరరావు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు పద్మావతి, కుమారి కల్పనా మౌళి పాల్గొన్నారు.

9 కేజీల గంజాయి స్వాధీనం

మద్రిపాలెం : కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఐదో పట్టణ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించి 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతం వి.మాడుగులకు చెందిన కొర్ర ఆనంద్‌కుమార్, సి.చిరంజీవి, పి.నాగేష్ మంగళవారం మధ్యాహ్నం కైలాసపురం శ్రామిక్‌నగర్ వద్ద గంజాయి తక్కువ ధరకు విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 కేజీల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



8 మంది అభాగ్యులకు ఆశ్రయం


నిరాశ్రయులతో ఏయూటీడీ కార్యదర్శి వాసు

సీతమ్మధార: రోడ్లపై తిరుగుతున్న ఎనిమిది మంది అభాగ్యులకు ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహం నుంచి పెందుర్తిలో గల లయోలా ఓల్డేజ్ హోమ్‌లో శాశ్వత ఆశ్రయం కల్పించారు. రైల్వే పోలీసులు, ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ, పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ఎనిమిది మంది మహిళలను ఇటీవలే ఇక్కడికి తరలించారు. ఇప్పుడు వారికి శాశ్వత ఆశ్రయం కల్పించారు. జ్యోత్స్న(25), ధరణి (55), బిడియా (50), జాను (32), కమల (40), అలుపు (55), మరో 25, 55 ఏళ్ల గుర్తు తెలియని మహిళలు కూడా వీరిలో వున్నారు. వీరంతా కుటుంబం వివరాలు చెప్పలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు లేకపోవడంతో వీరికి జీవితకాల ఆశ్రయం కోసం ఏయూటీడీ చేసిన కృషి ఫలించింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు ఆధ్వర్యంలో మంగళవారం వీరిని పెందుర్తిలో గల లయోలా ఓల్డేజ్ హోమ్‌లో చేర్పించారు. కార్యక్రమంలో హోమ్ ప్రతినిధి ప్రకాశరావు, సిబ్బంది పాల్గొన్నారు. నిరాశ్రయులను తరలించిన వాసుకి సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు.